యైటింక్లయిన్ కాలనీ: మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

కేంద్రానికి సమ్మెతోనే సమాధానం చెబుదాం

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, మే 14 : కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ఈ నెల 20న తలపెట్టిన సమ్మెతో సమాధానం చెబుదామని జేఏసీ నాయకుడు, టీబీజీకేస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. ఆర్జీ-2 ఓసీపీ-3 కృషిభవన్‌లో బుధవారం జరిగిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ తదితర సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడి దేశావ్యాప్త సమ్మెకు మద్దతు తెలుపుతున్నాయని తెలిపారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తుందన్నారు. నాయకులు మాదాసు రాంమూర్తి, ఐలి శ్రీనివాస్, బేతి చంద్ర య్య, అబ్బు శ్రీనివాస్ రెడ్డి, మామిడి తిరుపతి, ముస్కుల అనిల్ రెడ్డి, హరిప్రసాద్, కొమిరి రాజ్‌కుమార్, తుమ్మల రాజారెడ్డి, బీ. శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్, మే14: సుద్దాల, సుగ్లాంపల్లి, గర్రెపల్లిలోని గోదాములలో హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యం రావు పర్యటించారు. ఈ నెల 20 న జరిగే దేశవ్యాప్తంగా సమ్మెలో హమాలీ కార్మికులు పాల్గొనాలని కోరారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, రాజమల్లు, ప్రసాద్, సమ్మయ్య, నరసయ్య,శంకర్, తిరుపతి, రాజయ్య, మల్లయ్య, పురుషోత్తం ఉన్నారు.

సమ్మెపోస్టర్ విడుదల

జ్యోతినగర్, మే 14: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ రామగుండం అంబేద్కర్ సెంటర్‌లో సీఐటీయూ రామగుండం ఎన్టీపీసీ ఏరియా కమిటీ వాల్‌పోస్టర్‌ను విడుదల చేసింది. ఎన్టీపీసీలో మున్సిపల్ కార్మికులకు సమ్మె కరపత్రాలను అందజేసి సమ్మెలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ సీఐటీయూ ఏరియా కమిటీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షుడు బిక్షపతి, కోశాధికారి రామాచారి, నాగభూషణం, శ్రీనివాస్, హమాలీ, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు ఎల్లయ్య, పోచం, వెంకటేశ్, సతీశ్, నాయకులు లక్ష్మణ్, లక్ష్మీ ఉన్నారు.

రామగిరి మే 14: దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయా ల ని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూ నియన్ (ఐఎఫ్‌టీయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న కోరారు. బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు చేపట్టే సమ్మెలో కాం ట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో కే మోహన్, నాగరాజు, రవి, రాజు, అశోక్, సింగర్ రవీందర్. తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడిన ప్రయాణికుడు

పెద్దపల్లి టౌన్, మే 14: పెద్దపల్లి-కొత్తపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు నుంచి మహారాష్ట్రకు చెందిన ప్రయాణికుడు సమీర్‌ఖాన్ ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి కాలుకు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. కాగా వెంటనే స్థానికులు గుర్తించి 108కు సమాచారం ఇచ్చిన పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారని రామగుండం రైల్వే హెడ్‌కాన్టిబుల్ తిరుపతి తెలిపారు. బుధవారం రాత్రి రైలు నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన ప్రయాణికుడిని పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు అక్కడి నుండి కరీంనగర్, మెరుగైన వైద్యం కోసం బంధువులు హైదరాబాద్‌కు తరలించినట్లు వివరాలు తెలిపారు. బంధువులు హూట హూటిన ఏలాంటి వివరాలు చెప్పాకుండానే శరవేగంగా తరలించారని అన్నారు. ప్రమాదంలో తీవ్రగాయాలు అయిన సమీర్‌ఖాన్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నదని కుటుంబ సభ్యులతో మాట్లాడాడని, ఊరు పేరు మాత్రం మహారాష్ట్ర అని మాత్రమే తెలుసునని పూర్తి వివరాలు తెలిదని చెప్పారు. ప్రమాదభాదితుడికి కాలుకు ప్రాక్చర అయ్యిదని, రెండు చేతులకు చిన్న గాయాలు తగిలినట్లు తెలిపారు.

ఖాళీ స్థలాలు కబ్జా..?

- మల్కాపూర్ సర్వే నం.56,57లో అక్రమ నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న బల్దియా అధికారులు
- చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ చంద్రయ్య న్యాయపోరాటం

కోల్‌సిటీ, మే 14: నగరంలోని ప్రభుత్వ స్థలాలు కొందరికి ఫలహారం అవుతున్నాయి. రాజకీయ పలుకుబడి ఉంటే చాలు... ఖాళీ జాగాలో పాగాలు వేసినా పట్టించుకునే నాథుడే ఉండడు. కార్పొరేషన్ ఐదో డివిజన్ పరిధి మల్కాపూర్‌లో గల సర్వే నం.56, 57 లోని ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా కార్పొరేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారు. కొందరు రేకుల షెడ్లు, మరికొందరు ఏకంగా ఇళ్లు యథేచ్ఛగా నిర్మిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో ఇదే సర్వే నంబర్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలు నగర పాలక అధికారులు యుద్ధ ప్రాతిపదికన కూల్చివేశారు. ఈ ఆక్రమణలపై మాజీ కౌన్సిలర్ మామిడాల చంద్రయ్య స.హ చట్టం ద్వారా వెలుగులోకి తీసుకవచ్చి చర్యలకు న్యాయ పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అది ప్రభుత్వ భూమే...

ఐదో డివిజన్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ మామిడాల చంద్రయ్య సర్వే నం.56, 57లో వెలిసిన నిర్మాణాలకు అనుమతుల విషయమై నగర పాలక సంస్థ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదని వాపోతున్నాడు. దాంతో సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు సమర్పించగా అధికారులు స్పందించి రామగుండం తహసీల్దార్‌కు పంపించారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. దీనితో కార్పొరేషన్ అధికారులు అది ప్రభుత్వ భూమేననీ, సర్వే నం.56లో 3.3 ఎకరాల నూమి, సర్వే నం.57లో 6.24 ఎకరాల భూమి ఉందనీ, వాటిలో ఏలాంటి నిర్మాణాలకు తాము అనుమతి ఇవ్వలేదంటూ గత నె 16న మామిడాల చంద్రయ్యకు వివరణ పత్రాలు అందజేశారు. అప్పటి నుంచి ప్రతి రోజూ కార్యాలయం చుట్టూ న్యాయం కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. స.హ చట్టం ద్వారా వెలుగులోకి వచ్చినా చర్యలు తీసుకోవడం లేదు. ఈ వ్యవహారంలో ఏమైనా చేతులు మారాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలపై మాజీ కౌన్సిలర్ చంద్రయ్య రెండు రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ ఏసీ) అరుణ శ్రీ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీహరిని వివరణ కోరగా, నెల రోజుల కిందటే తాను విధుల్లో చేరాననీ, వాటిని పరిశీలించాక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మల్కాపూర్‌లో వెలిసిన అనుమతి లేని నిర్మాణం

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి కృషి

పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ పూర్తి స్థాయిలో నిర్మూలించాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మే14: గ్రామ పంచాయతీలలో మల్టీ పర్పస్ వర్కర్లుగా పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో యూనిసెఫ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల భద్రత, రక్షణ, గౌరవం అంశంపై ఎంపీడీవోలకు , సం బంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. పారిశుధ్య కార్మికునికి తప్పనిసరిగా ప్రమాద బీమా పంచాయతీ నిధుల నుంచి ప్రీమి యం చెల్లించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభు త్వం అమలు చేస్తున్న పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పోస్టల్ వినియోగించుకొని బీమా తప్పనిసరిగా చేయించాలన్నారు. డిసెంబర్ నాటికి జిల్లాలో సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ ఉండటానికి వీలులేదన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. సమావేశంలో యూనిసెఫ్ శిక్షకులు కిషన్, స్వామి, ఫణీంద్ర, డీపీవో వీర బుచ్చయ్య, డీఆర్‌డీవో ఎం.కాళిందిని, జడ్పీ సీఈవో నరేందర్, స్వచ్ఛ భారత్ మిషన్ మేనేజర్ రాఘవులు, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజీవ్ యువ వికాసం, నీటి పారుదల శాఖ కాల్వల రిన్నోవేషన్‌పై సం బంధిత అధికారులతో జిల్లా సమావేశమ య్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తుది అర్హుల జాబితాను పారదర్శకంగా ఎంపిక చేసి ఎమ్మెల్యేలకు త్వరితగతిన రిపోర్ట్ అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీవో ఎం.కాళిందిని, జడ్పీ సీఈవో నరేందర్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంత్రి చిన్నచూపు చూస్తే ఎంపీగా గెలిచేవాడివా..?

- గడ్డం వంశీ అవివేకంగా మాట్లాడుతున్నరు
- స్థానిక నేతలకు సమాచారం లేకుండా
- మంథనిలో పర్యటించడం సరికాదు
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆర్ల నాగరాజు ఫైర్

మంథని, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిన్న చూపు చూస్తే ఎంపీగా గడ్డం వంశీకృష్ణ గెలిచేవారేనా..?, అతను ఒక్కసారి ఆలోచించుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆర్ల నాగరాజు సూచించారు. బుధవారం మంథని ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు చిన్న చూపు చూస్తున్నాడని ఇటీవల ఎంపీ గడ్డం వంశీ మాట్లాడడం అవివేకమన్నారు. ఎంపీ ఎన్నికల్లో మంథని నియోజకవర్గం నుంచి 50 వేలకు పైగా మెజార్టీ రప్పించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబు ఎంతో ప్రయాసపడ్డారన్నారు. మంథని నియోజకవ ర్గం లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండానే వంశీ పర్యటించడమేకాకుండా అతన్ని చిన్న చూపు చూస్తున్నారంటూ మీడియా ముందు చిట్ చాట్ చేస్తూ, సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీగా గెలిచి అధికార పార్టీలో ఉండి ప్రతిపక్ష పార్టీల నాయకులతో మంథని నియోజకవర్గంలో పర్యటనలు చేస్తుండడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఎంపీ గడ్డం వంశీ మంథనిలో పర్యటించే టైంలో తప్పనిసరిగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇక్కడ సమావేశంలో యూత్ నాయకులు కోరవేణ కృష్ణ వంశీ, బూడిద రమేశ్, ఆర్ల విఖిల్ ఉన్నారు.

బాధితుడిని ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

ఓదెల, మే 14: మడక గ్రామంలో విద్యుదాఘాతంలో 25 గొర్రెలు మృతి చెందగా, ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కరంట్ షాక్‌తో 25 గొర్రెలు చెందినట్లు తెలియడంతో వెంటనే మాజీ ఎమ్మెల్యే మడక గ్రామాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెల్సుకున్నారు. రాజకొమురయ్యకు సంబంధించిన 14మేకలు, 11గొర్రెలు మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. రూ.5లక్షల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు. అక్కడి నుంచే ట్రాన్స్‌కో ఎస్ఈ, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నిరుపేద కుటుంబానికి చెందిన రాజకొమురయ్యకు పరిహారం అందేలా చూడాలని కోరారు. మాజీ జడ్పీటీసీ గంట రాములు యాదవ్, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్, నాయకులు నోముల ఇంద్రారెడ్డి, గొర్ల కుమార్, నంద క్రాంతికుమార్, సదారెడ్డి, మల్లయ్య, లింగమూర్తి, నరేష్ రవీందర్, ఐలయ్య, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

బాధిత రైతులకు పరిహారం చెల్లిస్తాం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

పెద్దపల్లి, మే14: అకాల వర్షాల కారణంగా జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని, ఎవరు ఆందోళన చెందవద్దని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కేంద్రాల్లో తడిసి పోయిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం పూర్తి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అకాల వర్షాల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న పంట వివరాలను సేకరించి రైతులకు చెల్లించాల్సిన నష్ట పరిహారంపై నివేదిక అందించాలని వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈవోలకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

2, 18, 392 మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోలు

పెద్దపల్లి, మే14: ఈ యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు 2, 18, 392 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి మే 13 నాటికి 2022-23లో 11,026 మంది రైతుల నుంచి 88, 930 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 11 శాతం చెల్లింపులు, 2023-24లో 28, 427 మంది రైతుల నుంచి 2,11, 449 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 72 శాతం చెల్లింపులు చేయగా, 2024-25లో 29, 206 మంది రైతుల నుంచి 2, 18, 392 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 82 శాతం చెల్లింపులు పూర్తి చేశామని వెల్లడించారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు ప్రకారం కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు.

డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలించాలి

పెద్దపల్లి కమాన్, మే 14 : డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆర్ మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్-నార్కోటిక్స్ పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ బానిసైన వారిని కౌన్సిలింగ్ అండ్ డీ అడిక్షన్ సెంటర్‌కు పంపించి మాములు స్థితికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రగ్స్ గురించి సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి నిర్భయంగా సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. ఇక్కడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, ఎక్సైజ్ ఎస్ఐ జీవన్‌రెడ్డి, కానిస్టేబుల్స్ ఎ. కృష్ణ, కె. దిలీప్, అధ్యాపకులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఎలిగేడు,మే 14: అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముప్పిరితోటలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముప్పి రితోటకు చెందిన పూరెళ్ల అంజలితిరుపతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రెండో కూతురు ప్రవళిక(25)ను వివాహం సిరిసిల్ల మండలం పెద్దూరుకు చెందిన మద్దికుంట ప్రశాంత్‌తో 2023లో జరిగింది. కొంతకాలం వారి సంసారం సజావుగానే సాగింది. ఆ తర్వాత దంతపల మధ్య గొడవవలు మొదలయ్యాయి. ప్రవళిక భర్త ప్రశాంత్, అత్త శశికళ, మామ రామచంద్ర,ఆడపడుచులు దీప్తి,వాణి అదనపు కట్నం కోసం వేధించారు. ఈ క్రమంలో ప్రవళిక వేధింపులు తాళలేక 20రోజుల క్రితం పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటుంది. అయినా వేధింపులు ఆగకపోవడంతో ఈ నెల 11న మధ్యాహ్నం 12గంటల సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి ఈ నెల 13న మధ్యాహ్నం 3.57నిముషాలకు మృత్యువాతపడింది. మృతురాలి తల్లి పూరెళ్ల అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు జూలపల్లి ఎస్సై తెలిపారు.

నేత్రదానం గొప్ప నిర్ణయం

రామగిరి, మే 14 : సెంటినరికాలనీకి చెందిన జయలక్ష్మి-రవిశంకర్ కుమారుడు వసంత కుమార్ ఇటీవల మరణించారు. కుటుంబ సభ్యులంతా కలిసి తమ కుమారుడి వసంత కుమార్ కండ్లు దానం చేయాలనే ఆలోచన చేశారు. లయన్స్ క్లబ్ డైరెక్టర్, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణా రెడ్డికి సమాచారం అందించడంతో వెంటనే సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి సహకారంతో టెక్నీషియన్‌ను పిలిపించి కండ్లు సేకరించారు. ఇద్దరు అంధులకు చూపునివ్వడానికి కారణమయ్యారు. బుధవారం సదాశయ ఫౌండేషన్, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదాన సంస్మరణ సభ ఏర్పాటు చేసి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపి నేత్ర దానం నుంచి అవగాహన కల్పిస్తూ ప్రశంస పత్రం, జ్ఞాపికను మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి, సదాశయ ఫౌండేషన్ సభ్యులు నూక రమేష్ , సమ్మయ్య అందజేశారు.

పింఛన్ చెల్లింపునకు చర్యలు తీసుకోవాలి

గోదావరిఖని, మే 14: లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించని 5,058 మంది సింగరేణి పెన్షన్‌దారుల పింఛన్ నిలిపివేశారని, సీఎంపీఎఫ్ అధికారులు మానవతా దృక్పథంతో తిరిగి చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసి యేషన్ ఉప ప్రధానకార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ ప్రకట నలో కోరారు. సింగరేణి రిటైర్డు ఉద్యోగులు, మరణించిన వారి కుటుం బ సభ్యులు వివిధ కారాణాలతో లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించకపోవడంతో పెన్షన్ ఆగిపోయిందన్నారు. సమాచార హక్కు చట్టం కింద సింగరేణి వ్యాప్తంగా పెన్షన్‌దారులకు సంబంధించిన వివరాలను సేకరించినట్లు తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ సమర్పించక నిలిచిన పెన్షన్‌దారుల సంఖ్య వివరాలు. గోదావరిఖని కమిషనర్ పరిధిలో 3,240మంది, కొత్తగూడెం పరిధిలో 1,818మందికి పెన్షన్ ఆగిపోయిందన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

CHANGE OF NAME

★Nakka Kalpana W/o Nakka Ashok (Old name), H.No. 6-52, v/o Mandepally, Thangallapally mandal, Rajanna Sircilla. Pin. 505405, my Name is changing to Gunti Veena Devi W/o Nakka Ashok D/o Gunti Yellaiah (New Name)
NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములలో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలం అందుగులపల్లిలో అకాల వర్షానికి తడిసిన వడ్ల కుప్పలు

అకాల వర్షం..అన్నదాత అతలాకుతలం

పెద్దపల్లి/పెద్దపల్లి రూరల్, మే14: అకాల వర్షాలు అన్నదాతలకు కన్నీరు పెట్టిస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అమ్ముకొనే దశలో అకాల వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి. దీనికి తోడు కోనుగోళ్లలో జాప్యం కావటంలో రైతులు పాలిటా శాపంగా మారిందని రైతులు అవేదన చెందుతున్నారు. ఈనెల 10న సాయంత్రం, 14న తెల్లవారు జామును కురిసిన వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లిందని పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తడిసి ముద్దయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట సింగిల్ విండో పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, సీఈవో గడ్డితిరుపతి బుధవారం పరిశీలించారు. రైతులు ఆంతోళన చెందొద్దని కేంద్రాల్లో ఉన్న దాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని చెప్పారు.

జూలపల్లి, మే 14 ః మండలంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతులను అతలాకుతలం చేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం ధాటికి ధాన్యం, మక్కలు తడిసిపోయాయి. మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోనరావుపేటలో రోడ్డు కిరువైపులా ఉన్న చెట్లు గాలి వానకు విరిగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, గ్రామస్తులు తొలగించారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కేంద్రాల్లో తూకం వేసి బస్తాల్లో నింపిన ధాన్యం తడిసిపోగా, దానికి రైతులదే బాధ్యత అంటూ నిర్వాహకులు తేల్చిచెప్పడంతో ఆందోళన పడుతున్నారు. హమాలీల కొరత కారణంగా ధాన్యం తూకంలో జాప్యం జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరారు. దాదాపు ఒకటిన్నర సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు.

సుల్తానాబాద్/సుల్తానాబాద్ రూరల్, మే 14: సుల్తానాబాద్ పరిధిలోని పూసాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం లో సిబ్బంది నిర్లక్ష్యంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యం రాశులు కొట్టుకుపోయాయి. చేతికి అందిన పంట బుగ్గిపాలు కావడంతో రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. కొనుగోలు కేంద్రంలో 15 రోజుల క్రితం తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతుందన్నారు. పూసాల గ్రామానికి చెందిన ఉప్పం రవి కి చెందిన మూడు ట్రాక్టర్ల వడ్లు వరదలో కొట్టుకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజులుగా ఎక్కడి కుప్పలు అక్కడే ఉన్నాయని, అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కడారి సునీల్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అకాల వర్షాలకుకొనుగోలు కేంద్రాల్లో కుప్ప పోసిన ధాన్యం వర్షానికి తడిసిపోయిందన్నారు. పంట నష్టం జరిగిన కేంద్రాలను గుర్తించి బాధిత రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాని కోరారు.

అకాల వర్షంతో తడిసిన వరి ధాన్యం

అంతర్గాం, మే 14: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరిధాన్యం తడిసింది. మండలంలోని లింగాపూర్, రాయదండి, పెద్దంపేట, గోలివాడ, ఎల్లంపల్లిలోని వరి దాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏఈఓ హరీష్‌తో కలిసి ఏవో సతీశ్ పరిశీలించారు. తడిసిన ధాన్యం మొలకెత్తకుండా రైతులు ధాన్యంపై ఉప్పు పొడిని చల్లాలని సూచించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఓదెల, మే 14: కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం కోరారు. బ